నాగోలు ఇన్‌స్పెక్టర్‌గా సూర్యనాయక్



నాగోలు: నాగోలు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సూర్యనాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సుధీర్‌కృష్ణ బదిలీపై సైబర్ క్రైమ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సూర్యనాయక్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ద్వారకాతిరుమల కాలనీలో జరుగుతున్న ట్రంకులైన్ పనులు పూర్తయితే నాలుగైదు కాలనీల సమస్యలు తీరుతాయన్నారు. వర్షం వస్తే వివిధ కాలనీలవాసులు అనేక ఇబ్బందులకు గురయ్యారని ఆ విషయాన్ని తెలుసుకుని సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఏ కాలనీలో సమస్య ఉన్నా ప్రజలు తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తానని, గతంలో మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పనుల్లో వేగం పెరిగిందన్నారు కార్పొరేటర్ వెంట ఏఈ మల్లికార్జున్‌గౌడ్, నాయకులు గోపి రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు వినికిడి పరీక్షలు

నాగోలు: చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆశ్రయ్ ఆకృతి సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శరత్, డాక్టర్ శివరాములు అన్నారు. బుధవారం ఆశ్రయ్ ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో నాగోలు జైపురికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో వినికిడి పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మేఘమాల, ఆడియాలజిస్ట్ నరేష్, భార్గవ్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నేతలు



బండి సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

మలక్‌పేట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాలాధారణలో ఉన్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మలక్‌పేట బీజేపీ నేతలు కరీంనగర్‌కు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం, మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేంద్రమంత్రిని సన్మానించి దేవీనవరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపినట్లు సురేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కొప్పుల దినేష్ పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న కృష్ణకుమార్

మన్సూరాబాద్: ఇటీవల ఆకాల మరణం చెందిన కెమిస్ట్ బాలముకుంద్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. పెండెం కృష్ణకుమార్ పిలుపు మేరకు మెడికల్ దుకాణాల యజమానులు స్పందించి అందరు కలిసి రూ.51,670 బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, సురేష్, ఇంద్రారెడ్డి, మహమ్మద్ అబ్దుల్ గఫార్‌ఖాన్ పాల్గొన్నారు.

బాధితులకు సహకారం అందిస్తున్నాం



మూసీ నిర్వాసితులతో మాట్లాడుతున్న యుగేందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మూసీ నిర్వాసితుల కుటుంబాలకు అన్ని విధాల సహాయ సహకరాలు అందిస్తున్నామని మలక్‌పేట సర్కిల్–6 యూసీడీ పీఓ యుగేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మలక్‌పేట డీసీ కార్యాలయంలో మాట్లాడుతూ.. మూసీ నిర్వాసితుల పిల్లలకు పాఠశాలలో ప్రవేశాలు, మహిళలకు సెల్ఫ్ గ్రూపులలో చేరికలు, కుటుంబ యజమానికి వ్యాపారం చేసుకునేందుకు బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడటం, అదే విధంగా నిర్వాసితుల కుటుంబంలో ఎవరైనా విద్యార్థులు చదువు పూర్తి చేసి ఉంటే జాబ్‌మేళాలో వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

బాలిక స్నానం చేస్తుండగా వీడియో చిత్రీకరణ

- ఇద్దరిపై కేసు

సైదాబాద్: బాలిక స్నానం చేస్తుండగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడమే కాకుండా, ప్రశ్నించడంతో బాధితులపై బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాబాద్ పీఎస్ పరిధి ఓ బస్తీకి చెందిన బాలిక (16) ఇంటి వద్ద ఉన్న రేకుల బాత్రూమ్‌లో స్నానం చేస్తుండగా, అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా గమనించిన బాలిక కేకలు వేయడంతో పారిపోయారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు యువకులను కలిసి ఎందుకిలా చేశారని ప్రశ్నించగా వారినే బెదిరించారు. తమ గురించి ఎవరికైనా చెప్పినా.. పోలీసులకు ఫిర్యాదు చేసినా రికార్డు చేసిన వీడియోను సోషల్ మీడియాలో పెడుతామంటూ బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జగమేలు తల్లి.. కల్పవల్లి



శ్రీసరస్వతీదేవి అలంకరణలో కొలువుదీరిన జయదుర్గామాత

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో అమ్మోరు మండపాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు అలరిస్తున్నాయి.

–ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



మాతామైదాన్‌లో అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



శ్రీమహా సరస్వతీదేవిగా విజయదుర్గామాత



పెద్దతోటలోని వాగామ్రి దుర్గామాత పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ కాళే అశోక్



పాత మలక్‌పేటలోని హనుమాన్ మల్లికార్జున స్వామి దేవాలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



రాజప్ప నగర్‌లోని అమ్మవారి పూజలో నాగిరెడ్డి సుధీర్‌రెడ్డి, సునిల్‌రెడ్డి, దీపావళి శ్రీకాంత్, శ్రవణ్, లక్ష్మణ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి



సాహెబ్‌నగర్‌లో దుర్గామాత పూజలో పాల్గొన్న భక్తులు



మన్సూరాబాద్ పోచమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వినాయక్‌నగర్ కాలనీలో దుర్గామాత మండపం వద్ద పూజల్లో పాల్గొన్న ఏసీపీ కృష్ణయ్య

‘మాదిగలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్’



ఎల్‌బీనగర్‌లో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగోలు: ఎస్సీ వర్గీకరణ చేయకుండా సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డీఎస్సీ ఫలితాల్లో 11065 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం అంటే మాదిగలకు అన్యాయం చేయడమేనని ఎల్‌బీనగర్ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ అన్నారు. బుధవారం ఎల్‌బీనగర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ.. 1 ఆగస్టు 2024 నాడు సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ అన్ని రాష్ట్రాల కన్నా ముందు నేనే చేస్తానని ఇచ్చిన హామీని తుంగల తొక్కి మాలల ప్రలోభాలకు లొంగి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో మాదిగలు, ఉప కులాలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ మాదిగ, కొమ్ము రాజశేఖర్, రాజు మాదిగ, బుచ్చన్న మాదిగ, లింగం మాదిగ, మొండి కత్తి పరశురాం మాదిగ, ఇరుగు రవి మాదిగ, సాయి మాదిగ, కృపాకర్ మాదిగ పాల్గొన్నారు.

కథనం చదివారు.. పరిష్కారానికి కదిలారు



వ్యర్థాల తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న ఏఎంహెచ్‌ఓ, కార్పొరేటర్



సాక్షిలో ప్రచురితమైన కథనం

మలక్‌పేట: మూసారంబాగ్ సంజీవయ్యనగర్‌లోని ఓపెన్ ప్లాట్లలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి పాములు సంచరిస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించేవారు భయాందోళనకు గురయ్యేవారు. వ్యర్థాలు తరలించాలని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ సమస్యపై ఈ నెల 1న ‘వామ్మో.. పాములు’ అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ సర్కిల్– 6 ఏఎంహెచ్‌ఓ అనురాధ స్పందించి బుధవారం సదరు స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత స్థల యజమానులను పిలిపించి నివాసాల మధ్య చెత్తచెదారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాగ్‌ముసారిమో ప్రభుత్వ పాఠశాల పక్కనున్న ఓపెన్ ప్లాట్లు, బస్తీ మధ్య ఉన్న స్థల యజమానులకు ఒక్కొకరికి రూ.50 వేలు జరిమానా విధించినట్లు ఏఎంహెచ్‌ఓ తెలిపారు. వెంటనే జేసీబీలతో ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్త, చెదారం, వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ‘సాక్షి’కి బస్తీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మన్సూరాబాద్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆటోనగర్‌లోని గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆటోనగర్‌లోని గోదాముల్లో పనిచేస్తున్న కార్మికులకు పనికి తగిన వేతనాలు అందడం లేదన్నారు. హమాలీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమావత్ సక్రు, నాగశేషయ్య, కొండప్ప, కుర్మయ్య, బాల నర్సింహ, చంద్రశేఖర్, శరణప్ప పాల్గొన్నారు.

ప్రచార ఉద్యమంలో భాగస్వామ్యం కావాలి..

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఈ నెల 15న జరిగే ప్రచార ఉద్యమంలో కార్మికులందరూ భాగస్వామ్యం కావాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రమోహన్, కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఎం ఆటోనగర్‌శాఖ ప్రథమ మహాసభ మెట్టు కృష్ణ అధ్యక్షతన బుధవారం ఆటోనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవినీతికి వెన్నుదన్నుగా ఉందన్నారు. ఎన్నికల బాండ్ల పేరుతో అవినీతిని చట్టబద్ధం చేశారన్నారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగం యాదవ్, లక్ష్మణ్, సత్యనారాయణ, లింగస్వామి, వీరయ్య,సురేష్, మల్లేష్, సైదులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెల అందజేత

నాగోలు: ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక పేద కుటుంబాలకు చేయూతనిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్, పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడకు చెందిన రేణుక వివాహానికి పుస్తె, మెట్టెలు, చీర, అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేస్–2లో తాగునీటిలో మురికి నీరు కలిసి సరఫరా అవుతుందని ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ జిల్లా కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్ బస్తీలోని సమస్యలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఫేస్–2లో తాగునీటిలో మురికి నీరు కలుస్తుందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందన్నారు. వర్షాకాలంలో వరదలతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఓపెన్ నాలా పనులకు నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. వినతి ఇచ్చిన వారిలో బోయపల్లి రాములు గౌడ్ మదిలేటి, లక్ష్మీ, రమాదేవి, అనురాధ, ముత్తమ్మ, అనిత, సంధ్య ఉన్నారు.

చాదర్‌ఘాట్ బ్రిడ్జి కింద మృతదేహం

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ బ్రిడ్జి కింద ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం చాదర్‌ఘాట్ బ్రిడ్జి కింద మృతదేహం పడి ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించగా అజంపురాకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్‌అలీ (55)గా గుర్తించారు. బ్రిడ్జిపై నుంచి ప్రమాదవశాత్తు పడి చనిపోయి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పూర్తి

చాదర్‌ఘాట్: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే కోసం వాహెద్‌నగర్ కాలనీలో చేపట్టిన సర్వే పూర్తయినట్లు డీసీ జయంత్ తెలిపారు. 1240 ఇళ్లు సర్వే చేశామని గురువారం (నేడు) ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నాగోలు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, పాఠశాలలో సౌకర్యాల కల్పనకు పీఆర్‌టీయూటీఎస్ కృషి చేస్తోందని బత్తుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బుధవారం నిర్వహించిన పీఆర్‌టీయూటీఎస్ 35వ కౌన్సిల్ రాష్ట్ర సమావేశాల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉప్పల్ మండలం నుంచి బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు.